సాక్షి
వరంగల్
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరిగేనా?

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21 నుంచి నిర్వహించాలని నిర్ణయించారు. - 8లో▸



కవి.. కష్టజీవి పక్షానే ఉండాలి

కవి ఎప్పుడూ కష్టజీవి పక్షానే ఉండాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$39^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

మల్బరీ సాగు లాభదాయకం



గీసుకొండ: రైతులు వరి, పత్తి , మిరప, మొక్కజొన్న పంటలకు బదులుగా మల్బరీ సాగు చేసి ఆర్థికంగా లాభపడాలని పట్టు పరిశ్రమశాఖ సంయుక్త సంచాలకురాలు అనసూయ సూచించారు. మండలంలోని దస్రుతండాలో మల్బరీ సాగుపై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మల్బరీని రెండు ఎకరాల్లో సాగు చేస్తే రూ.మూడు లక్షల నికర ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పంట సాగుచేస్తే ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. పట్టు పరిశ్రమల సహాయ అధికారులు అరవింద్, షోయబ్ ఖాన్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నర్సంపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన నర్సంపేట పట్టణంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని వల్లభ్‌నగర్ మార్కండేయ కాలనీకి చెందిన బండ లక్ష్మయ్య రాజుపేట గ్రామ శివారులోని ఎస్టీ హాస్టల్‌లో వంటమనిషిగా పనిచేస్తున్నాడు. పనులు ముగించుకుని లక్ష్మయ్య సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. మార్కండేయ కాలనీ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా నర్సంపేట నుంచి కమలాపురం గ్రామానికి వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు కొర్రె సాంబయ్య ఢీకొన్నాడు. ఈఘటనలో ఇద్దరు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బండ లక్ష్మయ్యను ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు.

నేడు 'ప్రేమకు జై' విడుదల



నెక్కొండ: మల్లం శ్రీనివాస్ దర్శకత్వం వహించిన 'ప్రేమకు జై' సినిమా శుక్రవారం నెక్కొండ సూర్య థియేటర్‌లో విడుదల కానుంది. నెక్కొండ ముద్దుబిడ్డ బూరగాని అనిల్‌గౌడ్ రెండోసారి హీరోగా నటించిన ఈ సినిమా యూత్‌ను అలరించనుంది. ఆయన 'వజ్రాలు కావాలా నాయనా' సినిమాతో వెండి తెరకు పరిచయమయ్యాడు. మూడు ఫైట్స్, ఒక ఐటెం సాంగ్, శివుడి మీద ఒక సాంగ్ చాలా బాగుందన్న టాక్ వినిపిస్తోంది. యూత్‌కి నచ్చే సావరియా సాంగ్ ఈ సినిమాకు హైలెట్‌గా నిలువనుంది. విలన్‌గా సలార్ ఫేమ్ భాస్కర్, హీరోయిన్‌గా జ్వలిత నటించారు.

జాతీయ ఎస్సీ కమిషన్‌కు కొండేటి శ్రీధర్ ఫిర్యాదు



వర్ధన్నపేట: సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి రోజున తనకు జరిగిన అవమానంపై వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ గురువారం ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై సోమవారం స్థానికుడు కొండేటి బాబు, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్‌తో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతోపాటు డీజీపీ, వరంగల్ సీపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

'రాజ్యాంగం' ఆడియో సీడీ ఆవిష్కరణ



విద్యారణ్యపురి: కవి, ప్రజా కళాకారుడు, జాతీయ ఉపాధ్యాయ ఉత్తమ అవార్డు గ్రహీత డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు రచించి స్వరపరిచిన 'మన భారత రాజ్యాంగం' ఆడియో సీడీని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ఆవిష్కరించారు. గురువారం హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, వీఆర్ విద్యార్థి, పి.కృష్ణమాచారి, ప్రొఫెసర్ రతన్‌సింగ్ ఠాకూర్, డోలి రాజలింగం, బండా కాళిదాస్, మండల పరశురాములు, సామాజిక కార్యకర్త నల్లమూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్‌లో తాత్సారం..!



సహకారం అందిస్తున్న జెడ్పీ సెక్షన్ అధికారులు

- కోరుకున్న చోటుకు వెళ్లేందుకు లాంగ్ లీవులు
- సంఘాల డిమాండ్‌తో ప్రత్యేకాధికారి వద్దకు ఫైల్

జిల్లా పరిషత్ కార్యాలయం

వరంగల్: జిల్లా పరిషత్ పరిధిలోని మండలాల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నా ఇతర శాఖలో పనిచేసి వచ్చిన ఉద్యోగికి పోస్టింగ్ ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జెడ్పీకి చెందిన ఒక జూనియర్ అసిస్టెంట్ జెడ్పీ కార్యాలయ ఆవరణలో ఉన్న పీఆర్ ములుగు క్యూసీ సబ్ డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. పీఆర్ ఇంజనీరింగ్‌శాఖలోని ఒక ఏఈ చనిపోవడంతో కారుణ్య నియామకం కింద అతడి కుమారుడికి ఇదే క్యూసీ సబ్ డివిజన్‌లో పోస్టింగ్ ఇస్తూ పీఆర్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో అక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ జెడ్పీలో ఇతర ప్రాంతంలో పోస్టింగ్ కోసం రిపోర్టు చేశారు. మార్చి రెండోవారంలో రిపోర్ట్ చేసినా ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వడం లేదని, ఇందుకు సంబంధిత సెక్షన్ అధికారులు సహకారం అందిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఆరోపిస్తున్నారు.

దొడ్డిదారిన పోస్టింగ్ పొందేందుకు..

జిల్లా పరిషత్ పరిధిలో సాధారణ బదిలీలు లేకపోవడంతో దొడ్డిదారిన కోరుకున్న చోట పోస్టింగ్ పొందేందుకు ఉద్యోగులు లాంగ్ లీవు పెడుతున్నారు. ఏ మండలంలోనైనా ఒక ఉద్యోగి 6 నెలల పాటు సెలవులో ఉంటే సదరు ఉద్యోగిని జెడ్పీకి సరెండర్ చేస్తారు. వరంగల్ మండలం పైడిపల్లి ప్రభుత్వ పాఠశాలలోని జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ విరమణ పొందుతున్న విషయం తెలుసుకున్న చెన్నారావుపేట మండల కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి లాంగ్ లీవు పెట్టినట్లు సమాచారం. ఫిబ్రవరి నెలాఖరున పైడిపల్లి పాఠశాలలోని జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ విరమణ పొందడంతో ఖాళీ ఏర్పడింది. ఈ ఖాళీలో క్యూసీలో పనిచేసిన జూనియర్ అసిస్టెంట్ జాయిన్ అయ్యేందుకు ప్రయత్నాలు చేసినా సంఘం నాయకులు అభ్యంతరం చెప్పారు. ఈస్థానంలోకి లాంగ్‌లీవు పెట్టిన చెన్నారావుపేట నుంచి జెడ్పీకి వచ్చిన ఉద్యోగికి అధికారులు పోస్టింగ్ ఇచ్చారు. ఆశించిన స్థానం భర్తీ కావడంతో జూనియర్ అసిస్టెంట్ చెన్నారావుపేటకు పోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. భూపాలపల్లిలో జూనియర్ అసిస్టెంట్ సతీమణి ఉద్యోగం చేస్తున్నందున అక్కడ ఖాళీగా ఉన్న సబ్ డివిజన్‌లో పోస్టింగ్ తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేయడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. సంఘాల నాయకుల ఒత్తిడితో జూనియర్ అసిస్టెంట్‌కు చెన్నారావుపేటలో పోస్టింగ్ ఇచ్చేందుకు జెడ్పీ అధికారులు ఫైల్ సిద్ధం చేసి జెడ్పీ ప్రత్యేక అధికారి, కలెక్టర్ వద్దకు పంపారు. ఈఫైల్‌పై కలెక్టర్ రిమార్క్స్ రాయగా తిరిగి జెడ్పీకి వచ్చినట్లు తెలిసింది. కలెక్టర్ ఆమోదించిన వెంటనే జూనియర్ అసిస్టెంట్‌కు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేస్తామని జెడ్పీ ఎస్టాబ్లిష్‌మెంట్ సూపరింటెండెంట్ తెలిపారు.

జెడ్పీల్లో ఇష్టారాజ్యం..

జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. చైర్మన్ల స్థానంలో ప్రత్యేక అధికారులుగా నియమితులైన ఆయా జిల్లాల కలెక్టర్లు జెడ్పీ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఉద్యోగ సంఘాల నాయకులు అంటున్నారు. ఇందువల్ల జెడ్పీల్లో అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా మారిందని ఆరోపిస్తున్నారు. జెడ్పీ నుంచి ఉద్యోగులకు సంబంధించిన ఫైళ్లు ప్రత్యేక అధికారుల ఆమోదం కోసం పంపితే జాప్యం జరుగుతున్నదని, ఈవిషయాలపై ఉద్యోగులకు సమాధానం చెప్పలేక జెడ్పీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్‌లన్నింటిలో ఈపరిస్థితులు నెలకొన్నట్లు తెలిసింది. ప్రత్యేక అధికారులు జిల్లా పరిషత్‌లపై దృష్టి సారించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలి



కాపులకనిపర్తిలో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

సంగెం: కేంద్ర ప్రభుత్వం వెంటనే స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. కాపులకనిపర్తిలో తెలంగాణ రైతు సంఘం గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు నిర్ణయించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. పెరిగిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు, ట్రాక్టర్, కూలీల ఖర్చులు, రైతుల శ్రమ, పెట్టుబడిని సరిగా అంచనా వేడయం లేదని విమర్శించారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పంటల బీమా చేయించాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఓదెల రాజయ్య, ఊరటి అంశాలురెడ్డి, మోకిడి పేరయ్య, పి.సైడి, కర్ర రాజిరెడ్డి, రాజగోపాల్, బషీర్, మల్లేశం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



వరి పంటను పరిశీలిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.రూ.25 వేల పరిహారం అందించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఆరెల్లి క్రాస్‌వద్ద గురువారం ఆయన వరి పంటలను పరిశీలించారు. అనంతరం పెద్ది విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వడగళ్ల వర్షం కురిసి మూడు రోజులవుతున్నా ఎమ్మెల్యే, వ్యవసాయ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. రెండు రోజుల్లో సర్వే ప్రారంభించకపోతే రైతులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. రూ.మూడు చొప్పున వడ్డీకి తీసుకువచ్చి పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు వేజేళ్ల కిషన్‌రావు, వడ్డె రాజశేఖర్, ఆబోతు అశోక్, మస్తాన్, వల్లెపు సోమయ్య, మచ్చిక అశోక్, బోడ పూలు, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బార్ అసోసియేషన్' ఎన్నికలు

వరంగల్ లీగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల 2025–26 నూతన కార్యవర్గం ఎన్నికకు శుక్రవారం పోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారులు చిదంబర్‌నాథ్, శ్రీధర్(వరంగల్), కె.రమేశ్‌బాబు, రవీందర్‌రావు (హనుమకొండ) ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, వరంగల్ జిల్లా న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ అంబేడ్కర్ హాల్, హనుమకొండ జిల్లా న్యాయవాదులు టెన్ కోర్ట్సు బిల్డింగ్‌లోని వెయిటింగ్ హాల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో 566, హనుమకొండలో 867 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నట్లు వివరించారు. అధ్యక్షుడి నుంచి కార్యవర్గ సభ్యుల వరకు 16 స్థానాలకు ఒక్కో జిల్లాలో ఇప్పటికే ఆరు స్థానాలు ఏకగ్రీవం కాగా మిగిలిన వాటికి ఎన్నికలు నిర్వహిస్తునట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికలు

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం వ్యవసాయ, సహకార శాఖల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, హార్వెస్టింగ్ యజమానులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో సుమారు 2.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసి, జిల్లా వ్యాప్తంగా సుమారు 182 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా రవాణా అధికారి శోభన్‌బాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఏఓలు, ఏఈఓలు, హార్వెస్టర్ల యజమానులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం @ 31,020

బీసీలవి 16,396 దరఖాస్తులు

- తక్కువగా వచ్చినవి ఈబీసీ, క్రిస్టియన్ మైనారిటీలవి
- ఈ నెల 14 వరకు అవకాశం ఉండడంతో అప్లికేషన్స్ పెరిగే చాన్స్
- అర్హులు సద్వినియోగం చేసుకోవాలంటున్న ఉన్నతాధికారులు

సాక్షి, వరంగల్: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రాజీవ్ యువ వికాసం (ఆర్‌వైవీ) పథకానికి జిల్లాలో దరఖాస్తుల పరిస్థితి విచిత్రంగా ఉంది. ఈనెల 10 వరకు ఆన్‌లైన్ ద్వారా 31,020 దరఖాస్తులు వస్తే.. ఇందులో ఒక్క బీసీలవే 16,396 దరఖాస్తులు ఉండడం గమనార్హం. ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీలు కలుపుకొని 14,624 దరఖాస్తులే ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అంటే సుమారు 55 శాతం దరఖాస్తులు బీసీలవి ఉంటే.. 45 శాతమే మిగిలిన వా రివి ఉన్నాయి. ఈ నెల 14తో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగియనుంది. జిల్లాకు మంజూరైన యూనిట్ల సంఖ్యతో పోల్చుకుంటే ఒక్క బీసీల్లో త ప్ప మిగిలిన వారిలో పెద్దగా పోటీ లేదని తెలు స్తోంది. అర్హులు సద్వినియోగం చేసుకోవాలంటే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఈబీసీల్లో తక్కువ మంది దరఖాస్తు..

జిల్లాకు ఈబీసీ కోటా కింద 403 యూనిట్లు మంజూరైతే కేవలం ఇప్పటివరకు 364 మందే దరఖాస్తు చేసుకున్నారు. అంటే దాదాపు 39 మంది ఇంకా తక్కువగా ఉన్నారు. క్రిస్టియన్ మైనారిటీలకు 99 యూనిట్లు మంజూరైతే ఇప్పటివరకు 44 మందే దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఎస్టీలకు 3038 యూనిట్లు మంజూరైతే 4,177 మంది, ఎస్సీలకు 3,442 యూనిట్లు మంజూరైతే 7,310 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. 'గ్రామీణ ప్రాంతం వారికి వార్షిక ఆదాయం రూ.1,50,000 లోపు, పట్టణ ప్రాంతం వారికి రూ.రెండు లక్షల్లోపు ఉండాలి. దరఖాస్తుదారులకు రేషన్‌కార్డు లేకుంటే మీ సేవ నుంచి పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. రాజీవ్ యువ వికాస పథకంలో భాగంగా వాహనాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి' అని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఉన్నతాధికారి సురేశ్ అన్నారు.

మంజూరైన యూనిట్లు, దరఖాస్తుల వివరాలు..

రాజీవ్ యువ వికాసం	ఎస్సీ	బీసీ	ఈబీసీ	ఎస్టీ	మైనారిటీస్	క్రిస్టియన్ మైనారిటీ
యూనిట్లు	3,442	2,357	403	3038	737	99
ఆర్థిక లక్ష్యం (రూ.కోట్లలో)	47.54	27.35	4.68	33.13	12.29	1.579
వచ్చిన దరఖాస్తులు	7,310	16,396	364	4,177	2,729	44

అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా రాజ్‌కుమార్



రాజ్‌కుమార్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగాధిపతి, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్‌కుమార్ కామన్ మెస్ సంయుక్త సంచాలకులుగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

అభివృద్ధి దిశగా కేఎంటీపీ

టెక్స్‌టైల్ పార్కులోని రాజీవ్ గాంధీ టౌన్‌షిప్‌లో వసతులు

- రూ.3,72,19,479తో టెండర్లు పిలిచిన టీఎస్ ఐఐసీ అధికారులు
- పీహెచ్‌సీ, ప్రైమరీ స్కూల్, జీపీ, వెటర్నరీ హాస్పిటల్ నిర్మాణం
- త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కసరత్తు



సాక్షి, వరంగల్: సంగెం, గీసుకొండ మండలాల్లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ) అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. చింతలపల్లి, శాయంపేట హవేలి గ్రామాల్లో సేకరించిన 1150 ఎకరాల్లో గణేశ్ ఎకోపేట్, గణేశ్ ఏకోటెక్ పరిశ్రమలు నిర్వహిస్తున్నాయి. కేరళకు చెందిన కైటెక్స్ వస్త్రపరిశ్రమ ఉత్పత్తి ప్రారంభించే దిశగా అడుగులు వేస్తోంది. ఇంకోవైపు దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీ 8 ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయనుంది. ఇలా ఓవైపు పరిశ్రమలు అందుబాటులోకి వస్తుంటే.. ఇంకోవైపు నిచేసే ఉద్యోగులతోపాటు అక్కడి గ్రామస్తుల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక పాఠశాల,గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాల కోసం టీఎస్ఐఐసీ రూ.3,72,19,479తో టెండర్లు పిలిచింది. టెక్స్‌టైల్ పార్కు కోసం భూములిచ్చిన 863 మందికి స్టేట్ రిజర్వ్‌డ్ కోటా కింద గత నవంబర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అక్కడే ఒక్కొక్కరికి కేటాయించిన 100 గజాల ఓపెన్ ప్లాట్‌లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు రూ.ఐదు లక్షలు ఇస్తామని ఉత్తర్వులిచ్చింది.

సకల సౌకర్యాల దిశగా...

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని రాజీవ్‌గాంధీ టౌన్‌షిప్‌లో వసతుల కల్పనకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. అభివృద్ధి పనులు చేపట్టేందుకు టీఎస్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ టెండర్లు పిలిచింది. గతంలోనే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనకు వచ్చిన సమయంలో మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం భూమి ఇచ్చిన వారితోపాటు పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా వసతులు కల్పిస్తామని ప్రకటించారు. ఇప్పుడు ఆ దిశగా పనులు మొదలు కానున్నాయి. ఏడాదిలోపు ఈ పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, పిల్లల దుస్తులు తయారు చేయడంలోనే ప్రసిద్ధి చెందిన కైటెక్స్ కంపెనీ 25,000 ఉద్యోగాల కోసం నియామక ప్రకటన ఇచ్చింది.

అభివృద్ధి పనులు, మంజూరైన నిధుల వివరాలు..

పనులు	నిధులు (రూపాయల్లో)
ప్రాథమిక పాఠశాల	1,82,05,658
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం	1,14,42,650
గ్రామ పంచాయతీ కార్యాలయం	43,29,640,
పశువైద్యశాల భవనం	32,41,531

సీపీని కలిసిన అటవీ, ఎక్సైజ్ అధికారులు



వరంగల్ క్రైం: జిల్లా అటవీ శాఖ అధికారి అనూజ్ అగర్వాల్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా అధికారులు వివిధ అంశాలపై చర్చించారు.

వాహనాలు తీసుకెళ్లండి: సీపీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ఘటనల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులకు అప్పగించడానికి నిర్ణయించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను భీమారంలోని సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో భద్రపర్చినట్లు, స్టేషన్ల వారీగా గుర్తించి సంబంధిత వాహన యజమానులకు నోటీసులు పంపినట్లు తెలిపారు. తగిన ఆధారాలతో వచ్చిన యజమానులకు వాహనాలను తిరిగి అందించనున్నట్లు వివరించారు. మరింత సమాచారం కోసం 87126 85143, 87126 85158, 87125 84557 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

తొలిరోజు 39 దస్తావేజుల రిజిస్ట్రేషన్

- 20 నిమిషాల్లోనే డాక్యుమెంట్ల అప్పగింత



వరంగల్ ఆర్వో కార్యాలయంలో తొలిరోజు రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్టర్ సుజిత్‌కు పత్రాలను అందజేస్తున్న ఆర్వో సైదులు

వరంగల్: రిజిస్ట్రేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నిబంధనల ప్రకారం బుక్ చేసుకున్న స్లాట్లతో గురువారం వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 39 దస్తావేజులను రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. పైలట్ ప్రాజెక్టు కింద వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి రోజు పని గంటల్లో దస్తావేజులు బుక్ చేసుకునేందుకు 48 స్లాట్లు, పనివేళలు ముగిసిన తర్వాత 5 స్లాట్ల (సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చిన వారి కోసం) దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ల శాఖ కేటాయించింది. తొలి రోజున 39 స్లాట్లు దస్తావేజుల కోసం బుక్ చేసుకోగా అందులో మూడు పార్టీలు రాకపోవడంతో 36 మందికి రిజిస్ట్రేషన్లు చేశారు. పనివేళలు ముగిసిన అనంతరం 5 స్లాట్లు అందుబాటులో ఉండగా అందులో ముగ్గురి దస్తావేజులను రిజిస్ట్రేషన్లు చేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకు 12 దస్తావేజులు రిజిస్ట్రేషన్లు చేసుకోగా 10 మందికి అధికారులు పత్రాలు అప్పగించారు.

సరిదిద్దేందుకు మళ్లీ స్లాట్..

స్లాట్ బుకింగ్ సమయంలో పేర్కొన్న వివరాల ప్రకారమే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేస్తారు. బుకింగ్ సమయంలో పేర్కొన్న వివరాలను సరిదిద్దాలంటే మళ్లీ కొత్తగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎడిట్ ఆప్షన్ తొలగించడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇతరుల పేర్లను తొలగించడం, చేర్చేందుకు అవకాశం లేకుండా పోయింది.

వెంటనే పత్రాలు అందిస్తున్నాం..

వ్యక్తిగతంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి దస్తావేజులను వెంటనే స్కానింగ్ చేసి 20 నిమిషాల్లో అందజేస్తున్నాం. గ్రూపులుగా ఉన్న వారి దస్తావేజులను స్కానింగ్ చేయడానికి కొంత సమయం పడుతోంది. పూర్తయిన వెంటనే పత్రాలను అందిస్తున్నాం.

–సైదులు, సబ్ రిజిస్ట్రార్, వరంగల్

క్లుప్తంగా

నకిలీ వైద్యుడిపై కేసు నమోదు



ఆప్టికల్స్ షాపును పరిశీలిస్తున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు

ఎంజీఎం : నగరంలోని జేపీఎన్ రోడ్డులోని డెక్కన్ ఆప్టికల్స్ యజమాని ఎం.జనార్దన్ కంటి వైద్యుడిగా చలామణీ అవుతూ ప్రజలను మోసం చేస్తున్న విషయాన్ని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు గుర్తించినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రజాసంబంధాల కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు నకిలీ వైద్యుడు ఎం.జనార్దన్‌పై కౌన్సిల్ రిజిస్ట్రార్ డి.లాలయ్యకుమార్, చైర్మన్ కె.మహేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసినట్లు నరేశ్ తెలిపారు. ఆప్టోమెట్రిస్టులు, సహాయకులు రెఫ్రాక్షన్ సేవలు (కంటి డిగ్రీలు కొలవడం) మాత్రమే చేయాలన్నారు. కానీ వైద్య సలహాలు ఇవ్వడం, కంటి వ్యాధులకు మందులు సూచించడం లేదా శస్త్ర చికిత్సల పేరుతో మోసం చేయడం చట్టవిరుద్ధమని వివరించారు. ఇలా ఎలాంటి అర్హత లేకుండా వైద్య వృత్తి ప్రాక్టీస్ చేస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ వైద్యుల బారిన పడితే పోలీసులు లేదా మెడికల్ కౌన్సిల్‌కుantiquackerytmc@onlinetsnc.in మెయిల్ ద్వారా లేదా 91543 82727 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

దామెర: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని పోచమ్మకుంట సగరవీధికి చెందిన వేముల మల్లేశం(46) తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మండలకేంద్రంలో ఇంటి నిర్మాణ పనుల నిమిత్తం కూలీ పనికి వచ్చాడు. మధ్యాహ్న సమయంలో పనులు చేసుకుంటూ కళ్లు తిరుగుతున్నాయని పక్కకు వెళ్లి కూర్చొని కుప్పకూలాడు. దీంతో స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వెంటనే వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

వాగులో పడి వృద్ధుడు..

శాయంపేట: మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన సముద్రాల రాజమొగిలి (85) గురువారం వాగులో పడి మృతి చెందాడు. రాజమొగిలి మతిస్థిమితం కోల్పోయి ఇంటి వద్దే ఉంటున్నాడు. రాజమొగిలికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె. గతంలో అతడి భార్య మృతి చెందగా.. రాజమొగిలి కొడుకుల వద్దే ఉంటున్నాడు. గురువారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఆయన కుమారులు వెతకగా.. మండలంలోని గట్లకానిపర్తి శివారులోని వాగులో పడి మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు సముద్రాల గణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరిగేనా?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తేనే పరీక్షలు నిర్వహిస్తాం
- ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాల స్పష్టీకరణ
- పరీక్షలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ముడిపెట్టొద్దు : రిజిస్ట్రార్
- విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజు వసులు చేసినా యూనివర్సిటీకి చెల్లించని ప్రైవేట్ యాజమాన్యాలు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీ వొకేషనల్ తదితర కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 21 నుంచి నిర్వహించాలని పరీక్షల విభాగం అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. అయితే అయా పరీక్షలు నిర్వహణకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సిద్ధంగా లేవు. మూడేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని, అందుకే తాము ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలు నిర్వహించబోమని కొద్దిరోజుల క్రితమే సంఘం బాధ్యులు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పరీక్షల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఫలితంగా వేలాది మంది విద్యార్థులు పరీక్షలు జరుగుతాయా లేదా అనే అంశంపై ఆందోళన చెందుతున్నారు.

5న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ సమావేశం

ఈనెల 5న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సమావేశం నిర్వహించుకున్నాయి. ఇందులో పలు తీర్మానాలు చేసుకున్నాయని సమాచారం. విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజులు వసూలు చేసి అలాగే ఉంచుకోవాలని, యూనివర్సిటీకి ఎప్పుడు చెల్లించాలని నిర్ణయిస్తే అప్పుడు వెంటనే చెల్లించాలని, ఫీజు చెల్లించిన విద్యార్థుల వివరాలను నామినల్ రోల్స్(ఎన్ఆర్)లో ఎంటర్ చేయాలని నిర్ణయించాయి.

1, 3, 5వ సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించేందుకు..

కేయూ పరిధిలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు గత నెల 4న విడుదలైన విషయం విదితమే. అప్పట్లో యూనివర్సిటీ అకడమిక్ డీన్ విభాగానికి చెల్లించాల్సిన వివిధ రకాల ఫీజులు చెల్లించని కాలేజీల ఫలితాలు నిలిపిన విషయం విదితమే. ఆ తర్వాత ఎక్కువ శాతం కళాశాలలు చెల్లించినా ఆయా ఫీజులు 40కిపైగా కాలేజీలు చెల్లించలేదు. అయినా అన్ని కళాశాలల విద్యార్థుల ఫలితాలను చివరికి అధికారులు విడుదల చేశారు. నాలుగైదు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఫీజులు చెల్లించకపోయినా పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. అయితే ఆ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తక్కువ ఉండడంతో మళ్లీ ఆయా పరీక్షలు నిర్వహించేందుకు, బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసుకునేందుకు అవకాశం ఇచ్చారు. పరీక్షల ఫీజు చెల్లించేందుకు గడువు ఇచ్చారు. అపరాధ రుసుములేకుండా ఈనెల 11తో ముగియబోతుంది. ఆ పరీక్ష ఫీజులు కూడా విద్యార్థుల నుంచి ప్రైవేట్ యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ఈ ఫీజులు కూడా యూనివర్సిటీ పరీక్షల విభాగానికి చెల్లిస్తే డిగ్రీ 2,4,6 సెమిస్టర్లతోపాటే 1,3,5 సెమిస్టర్ల పరీక్షలు కూడా నిర్వహించాలనే యోచనలో పరీక్షల విభాగం అధికారులున్నారు.

73 కళాశాలల వరకే పరీక్ష ఫీజులు చెల్లింపులు..

కేయూ పరిధిలో 292 వరకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, గురుకులాలు, అటానమస్ డిగ్రీ కళాశాలలున్నాయి. ఈ నేపథ్యంలో డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షల ఫీజులు చెల్లించేందుకు అధికారులు ఇప్పటికే రెండు సార్లు గడువు పొడిగించారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 9వతేదీతో గడువు ముగిసింది. అయితే ఇప్పటి వరకు అన్ని యాజమాన్యాలు కలిపి కేవలం 73 కళాశాలల వరకే యూనివర్సిటీలోని పరీక్షల విభాగానికి ఫీజులు చెల్లించాయని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కువ శాతం ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజులు వసూలు చేశారు. కానీ ఆ యాజమాన్యాలు గురువారం వరకు యూనివర్సిటీకి చెల్లించలేదు. తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకూ ఈ విద్యార్థుల పరీక్షల ఫీజులు యూనివర్సిటీకి చెల్లించొద్దని, పరీక్షలను కూడా నిర్వహించబోమని నిర్ణయంచుకున్నాయి. దీంతో వేలాది మంది విద్యార్థులు రాసే పరీక్షల నిర్వహణపై ప్రతిష్టంభన ఏర్పడింది.

పరీక్షల ఫీజు చెల్లించాలి



కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించేందుకు ఆ విభాగం సిద్ధంగా ఉంది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు యూనివర్సిటీ పరీక్షల విభాగానికి చెల్లించాల్సింటుంది. ఇంకా చెల్లించడం లేదు. ఫీజులు చెల్లించిన కాలేజీల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తాం. ఎందుకంటే ఫైనలియర్ విద్యార్థులకు ఇబ్బంది ఉంటుంది కాబట్టి. పరీక్ష నిర్వహణ ఫీజురీయింబర్స్‌మెంట్‌కు ముడిపెట్టొద్దు.

-ఆచార్య రామచంద్రం, రిజిస్ట్రార్, కేయూ

తెలంగాణ వ్యతిరేకి సీఎం రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభాస్థలి పరిశీలిన



బహిరంగ సభాస్థలిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎల్కతుర్తి: తెలంగాణ వ్యతిరేకి సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నడూ కొట్లాడిందిలేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి సమీపాన ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభాస్థలిని ఆయన గురువారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ సుమారు 1,200 ఎకరాల స్థలంలో సభ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి వచ్చే వాహనాలకు నాలుగు వైపులా రూట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సంవత్సరంన్నర కాంగ్రెస్ పరిపాలన అట్టర్‌ఫ్లాప్ అయిందని, ఆ పార్టీని గెలిపించి మోసపోయామని ప్రజలకు అర్థమైందని పేర్కొన్నారు. నీళ్ల లేవు.. పెట్టుబడిలేదు.. కరెంటు లేదు.. కల్యాణలక్ష్మి లేదు.. కేసీఆర్ కిట్టు లేదు.. తండాలకు రోడ్లు లేవన్న విషయాన్ని ప్రజలు రివ్యూ చేసుకుంటున్నారని తెలిపారు. నీళ్ల లేక పలు ప్రాంతాల్లో పంటలు ఎండిపోతుండడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. యావత్ తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను చూడాలే.. ఆయనకు ధైర్యం చెప్పాలన్న కుతుహలంతో ఎదురుచూస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు నాగుర్ల వెంకన్న, సదానందం, పిట్టల మహేందర్, మాజీ ఎంపీటీసీ కడారి రాజు, తంగెడ మహేందర్, జూపాక జడ్సన్ పాల్గొన్నారు.

కేయూ బంద్ విజయవంతం



ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- అక్రమ అరెస్టులను నిరసిస్తూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధర్నా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్‌చేసి 21జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యామండలి ముట్టడికి పిలుపునివ్వగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. దీనికి నిరసనగా గురువారం కేయూలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన బంద్ విజయవంతమైంది. క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయం, పరీక్షల విభాగం, ఆడిట్, యూజీసీ తదితర కీలక విభాగాలన్నింటినీ బంద్ చేయించారు. అలాగే, యూనివర్సిటీ పరిధిలోని పలు కాలేజీలను కూడా బంద్ చేయించారు. అనంతరం క్యాంపస్‌లోని పరిపాలనాభవనం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులు పి. కరుణాకర్‌రావు, సాధురాజేశ్, శ్రీధర్‌కుమార్‌లోథ్, బి.సతీశ్, మాదాసి కనకయ్య మాట్లాడుతూ కొన్నేళ్లుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్‌చేయాలన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాకే కొత్తగా అధ్యాపక పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. కాగా, రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆశీర్వాదం, సంకినేని వెంకట్, భిక్షపతి, రవీందర్, గడ్డం కృష్ణ, జూలసత్య, నాగయ్య, సూర్యనారాయణ, కవిత, శ్రీదేవి, స్వప్న, వీణ, సునీత, ఆర్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు.. సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య



సంజయ్‌కుమార్ (ఫైల్)

కాజీపేట: ఆర్థిక ఇబ్బందులతో ఓ సింగరేణి ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం రాత్రి కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట భవానీనగర్‌కు చెందిన ఊరడి సంజయ్ కుమార్(26) సింగరేణి ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల రూ. 76 లక్షలతో ఇదే కాలనీలో నూతన ఇంటిని కొనుగోలు చేశాడు. ఇంటి రిజిస్ట్రేషన్ తదితర ఖర్చులు అధికం కావడంతో అప్పులు పెరిగాయి. అప్పులు, వడ్డీలు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన సంజయ్‌కుమార్..బాపూజీనగర్‌లోని అమ్మమ్మ ఇంటికి వచ్చి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై మృతుడి తల్లి సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

వడ్డేపల్లి చెరువులో పడి నిట్ విద్యార్థి..



రిత్విక్‌సాయి మృతదేహం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి చెరువులో నిట్ వరంగల్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రుత్విక్ సాయి(23) నిట్ వరంగల్‌లో ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం సాయంత్రం ఆ యువకుడి మృతదేహం చెరువులో తేలియాడుతున్నట్లు స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. కాగా, రిత్విక్‌సాయి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

పిడుగు పాటుకు పశువుల మృత్యువాత



మృత్యువాత పడిన పశువుల వద్ద రోదిస్తున్న రైతు ఎల్లయ్య

బచ్చన్నపేట : పిడుగుపాటుకు మూడు పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండలంలోని కట్కూర్‌లో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మర్రికింది ఎల్లయ్య బుధవారం రాత్రి తన వ్యవసాయ బావి వద్ద రెండు ఎడ్లు, ఓ పాడి గేదెను కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం ఈదురుగాలులతో పాటు పిడుగులు పడ్డాయి. దీంతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా మూడు పశువులు మృత్యువాత పడి కనిపించగా బోరున విలపించాడు. ఈ ఘటనలో దాదాపు రూ. 2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. కాగా, బాధిత రైతు ఎల్లయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

కవి.. కష్టజీవి పక్షానే ఉండాలి

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంపశయ్యనవీన్, అరసం బాధ్యులు

విద్యారణ్యపురి: కవి ఎప్పుడూ కష్టజీవి పక్షానే ఉండాలని, ప్రజలను చైతన్యవంతం చేసేలా రచనలు ఉండాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. బుధవారం రాత్రి అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం (అరసం)90వ ఆవిర్భావ దినోత్సవం హనుమకొండలోని ఆదర్శ 'లా' కాలేజీలో నిర్వహించారు. ఈ సభకు అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి అధ్యక్షత వహించారు. అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో బ్రిటిష్ వలసవాదం, దోపిడీ, అణిచివేతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు లక్నోలో 1936 ఏప్రిల్ 9,10తేదీల్లో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటు అయిందన్నారు. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ మాట్లాడుతూ దేశంలో నాడు ఏ పరిస్థితులున్నాయో ఇప్పటికీ అవే పరిస్థితులు ఉన్నాయన్నారు. అణిచివేత కొనసాగుతోందన్నారు. అనంతరం పల్లేరు వీరస్వామి రచించిన 'వీక్షణాలు', కేపీఎల్ రచించిన 'లింగమ్మ' పుస్తకాన్ని అంపశయ్య నవీన్ , ప్రముఖ కవి బన్న అయిలయ్య ఆవిష్కరించారు. అరసం ఉపాధ్యక్షురాలు చందనాలసుమిత్ర పుస్తక సమీక్ష చేశారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అనిశెట్టి రజిత, బాధ్యులు మార్కశంకర్‌నారాయణ, నిధి, బూర భిక్షపతి, బూర విద్యాసాగర్, పాంచల్ రాయ్ మాట్లాడారు. న్యాయవాది ఏరుకొండ జయశంకర్, హనుమకొండ భారత్‌బచావో చైర్మన్‌రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ ఇంటికి వెళ్తూ మృత్యుఒడికి..

- బైక్‌ను ఢీకొన్న టిప్పర్.. వృద్ధుడి దుర్మరణం
- వరంగల్ హంటర్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద ఘటన
- నెక్కొండ మండలం సాయిరెడ్డి పల్లిలో విషాదం



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఖిలా వరంగల్ : కొత్త వాహనానికి రిజిస్ట్రేషన్ పూర్తయింది. అదే వాహనంపై బిడ్డ ఇంటికి వెళ్తూ ఓ వృద్ధుడు మృత్యుఒడికి చేరాడు. రోడ్డు ప్రమాదంలో దర్మరణం చెందాడు. ఈ ఘటన వరంగల్ హంటర్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సాయిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన పావులూరి వెంకటేశ్వర్లు (60) పర్వతగిరి మండల కేంద్రంలో నివాసముంటూ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నాడు. ఇంటింటికీ తాగు నీరు సరఫరా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల కొత్త బైక్‌ను కొనుగోలు చేశాడు. గురువారం ఉదయం వాహన రిజిస్ట్రేషన్ కోసం వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి చేరుకున్నాడు. రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే మధ్యాహ్నం హనుమకొండలోని కుమార్తె ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో వరంగల్ హంటర్ రోడ్డులోని ఫ్లైఓవర్ వద్ద టిప్పర్ ఎదురుగా బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని టిప్పర్‌ను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా, వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషయం తెలియడంతో స్వగ్రామం సాయిరెడ్డిపల్లి, ప్రస్తుతం ఉంటున్న పర్వతగిరి మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుమార్తె బొర్ర కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి.. బావిలో శవమై కనిపించి

- అనుమానాస్పదస్థితిలో వ్యాపారి మృతి
- చిన్నముప్పారంలో ఘటన



కిశోర్ (ఫైల్)

నెల్లికుదురు: ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యాపారి అనుమానాస్పదస్థితిలో వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. ఈ ఘటన గురువారం ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారంలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓబిలిశెట్టి కిశోర్ (40) కిరాణ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు కిశోర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కట్ల ఐలయ్య వ్యవసాయ బావివద్ద కిశోర్ వాహనం కనిపించింది. దీంతో వ్యవసాయ బావిలో చూడగా మృతి చెంది శవమై కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, కిశోర్ మృతికి కుటుంబ కలహాల లేదా.. మరే ఇతర కారణమా అనే విషయం తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

పీజీ కోర్సుల పరీక్షలు వాయిదా వేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఈమేరకు టైంటేబుల్‌ను కూడా ఇటీవల వెల్లడించారు. అయితే, పలువురు విద్యార్థులు ఆయా పరీక్షలు వాయిదా వేయాలని పరీక్షల విభాగం అధికారులకు గురువారం విన్నవించారు. ఈ సందర్భంగా పరీక్షల విభాగం అధికారులు మాట్లాడుతూ సకాలంలో పరీక్షలు నిర్వహిస్తే ఫలితాలను కూడా త్వరగా వెల్లడించే వీలుంటుందని, టైంటేబుల్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈక్రమంలో పరీక్షలు వాయిదా వేయాల్సిందేనని విద్యార్థులు వాగ్వాదానికి దిగినట్లు సమాచారం.

నేటి నుంచి లలితాయాగం



రాజరాజేశ్వరి దేవి అమ్మవారు


హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో శుక్రవారం నుంచి నాలుగురోజుల పాటు లలితా యాగం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి పూర్వంగం, అగ్నిప్రతిష్ట, తిథి నిత్య హోమాలు, లలితా హోమం, రాత్రి 8గంటలకు దశ విధహారాలు, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. రోజూ హోమం జరుగుతుందని తెలిపారు. సోమవారం హోమం మహాపూర్ణాహుతి జరుగుతుందని వివరించారు.

పశుదాణాకు ప్రత్యామ్నాయం.. 'అజొల్లా'



అజొల్లా తయారీ విధానం





అజొల్లాను తింటున్న కోళ్లు, పశువులు

- వేసవిలో పాడి పశువులకు దాణాగా వాడొచ్చు
- ఈ మొక్కలో మాంసకృత్తులు, లవణాలు, కెరోటిన్ అధికం

మహబూబాబాద్ రూరల్ : అజొల్లా.. ఆకుపచ్చ రంగులో ఉండే ఫెర్న్ జాతికి చెందిన మొక్క. దీనిలో మాంసకృత్తులు, లవణాలు, కెరోటిన్, విటమిన్ బీ2 ఎక్కువ ఉంటాయి. ఇది తక్కువ శాతం లిగ్నిన్ కలిగి సులభంగా జీర్ణమవుతుంది. అజొల్లా వాడకం వల్ల పశుదాణా ఖర్చుల్లో 20 నుంచి 25 శాతం తగ్గించొచ్చు.

- వెన్నశాతం, ఎస్ఎన్ఎఫ్ విలువలు పాలలో పెరుగుతాయి. దీంతో లీటర్ పాలకు రూ.60 పైసల నుంచి రూ. 1.50 వరకు అధిక ఆదాయం పొందొచ్చు.
- అజొల్లాను పాడి పశువులకే కాక గొర్రెలు, కోళ్ల మేతలో కూడా దాణాకు ప్రత్యామ్నాయంగా (బదులు) వాడొచ్చు.
- లూజ్ అజొల్లాను 1:1 నిష్పత్తిలో పశువుల దాణాతో కలిపి వాడొచ్చు. అజొల్లాను ఏ ఇతర పదార్థాలతో కలపకుండా కూడా దాణాగా వాడొచ్చు.

అజొల్లా తయారీ విధానం..

- రోజుకు 4 కిలోల అజొల్లా ఉత్పత్తి చేయడానికి 2.25 X 1.5 మీటర్ల కొలతలతో తొట్టి తయారు చేసుకోవాలి. (2.25 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల వెడల్పు), 9 అంగుళాల లోతు.
- 150 జీసీఎం మందం, 2.5 X 1.8 మీటర్ల సైజ్ గల సిల్పాలిన్ (షీట్) తొట్టిలో పరచాలి.
- 10 నుంచి 15 కిలోల సారవంతమైన మట్టిని సమానంగా పాలిథీన్ షీట్‌పై పరచాలి. తర్వాత 2 నుంచి 5 కిలోల, రెండు రోజుల ఆరిన పేడ 40 గ్రాములు, సూపర్ పాస్పెట్ 10 లీటర్ల నీటిలో కలిపి ఆ మిశ్రమాన్ని గుంతలో పోసి బాగా కలిపి పెట్టాలి.
- తొట్టిలో 7 నుంచి 10 సెంటీ మీటర్ల ఎత్తు వరకు నీరు ఉండేలా చూసుకోవాలి.
- 0.5 కిలోల నుంచి 1 కిలో అజొల్లా మదర్ కల్చర్‌ను గుంత అంతా సమానంగా చేయాలి. వేసిన వారం రోజులకు అజొల్లా గుంత అంతా అభివృద్ధి చెందుతుంది.
- కిలో అజొల్లా మదర్ కల్చర్ నుంచి వారం రోజుల్లో 8 నుంచి 10 కిలోల దిగుబడి వస్తుంది. ఏడో రోజు నుంచి అజొల్లాను ప్రతీరోజు వాడుకోవచ్చు.
- వారానికి ఒకసారి కిలో పేడను, 20 గ్రాముల లవ మిశ్రమాన్ని 5 లీటర్ల నీటితో గుజ్జుగా కలిపి తొట్టిలో వేయాలి.
- అజొల్లా పెంచడానికి ప్రత్యేకంగా స్థలం లేనివారు పండ్ల తోటలు, వాటిలో తొట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా షెడ్‌నెట్ల కింద నిర్మించుకోవచ్చు.
- ఉష్ణోగ్రత 20 నుంచి 28 డిగ్రీల సెంటిగ్రేడ్ మధ్య ఉండాలి. సూర్యరశ్మి నేరుగా పడకుండా ఆకులు చెత్త గుంతలో పడకుండా షెడ్‌నెట్ ఏర్పాటు చేసుకోవాలి.
- తొట్టిలో తేలియాడుతున్న అజొల్లాను ప్లాస్టిక్ జల్లెడతో బయటకు తీయాలి. తొలుత వారం రోజులకు తర్వాత ప్రతీరోజు అజొల్లా సేకరించొచ్చు. తొట్టి నుంచి తీసిన అజొల్లాను మంచి నీటితో కడిగితే పేడ వాసన రాదు.

అజొల్లాలో ఉండే పోషకాలు..

- అజోల్లా డ్రై వెయిట్ బేసిస్ ప్రకారం 25 నుంచి 30 శాతం మాంసకృత్తులు, 10 నుంచి 15 శాతం మినరల్స్, 7 నుంచి 10 శాతం అమైనా ఆసిడ్స్, బయోయాక్టివ్ పదార్థాలు ఉంటాయి.
- ఎక్కువ మాంసకృత్తులు, తక్కువ లిగ్నిన్ ఉండడం వల్ల వేగంగా, తేలికగా, తక్కువ ఖర్చుతో పెరుగుతుంది. దీని వల్ల దీనిలోని పోషకాలను పశువులు, కోళ్లు, గొర్రెలు తేలికగా జీర్ణం చేసుకుంటాయి.
- అజొల్లా గురించి మరింత సమాచారం కోసం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్. కిశోర్‌కుమార్ సెల్ నంబర్ 99594 66904ను సంప్రదించొచ్చు.